సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 2 । జనవరి । 2024



మహిళకు మరింత రక్ష!
దిశ వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు మరింత రక్షణ కల్పిస్తోంది. వివిధ సమస్యలతో సతమతమయ్యేవారికి సాంత్వన కలిగిస్తోంది. - 8లో



ఏమైందో..ఏమో..? - 8లో
ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న కుటుంబం.. ఇంటికి ఒక్కగానొక్క కొడుకు..హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. నెలకు రూ.లక్ష వరకు జీతం. ఏమైందోఏమో.. ప్రాణం తీసుకున్నాడు.



గుర్తు రావాలని..!
కాలం మారినా, టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా డైరీ మాత్రం తన ప్రాముఖ్యం కోల్పోలే దు. రోజువారీ ప్రణాళికకు డైరీయే ఆధారంగా నిలుస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

కోటదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ

పాలకొండ: నూతన సంవత్సరం సందర్భంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ భక్తులతో కుంకుమ పూజలు జరిపించారు. కొత్త సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదిస్తూ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడబ్ల్యూటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



టీడబ్ల్యూటీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి సోమవారం ఐటీడీఏలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ మంగవేణి, యూనియన్ నాయకులు శేషగిరి, కె.సుబ్బారావు, ఎం.రవి, సుందరరావు, నారాయణరావు, ఎం.భాస్కరరావు, రాజారావు, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెదపోలమాంబ తొలేళ్ల ఉత్సవం



అమ్మవారి ఘటాలను తిరువీధి జరుపుతున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ మేనత్త పెదపోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వెండిపూత అలంకరించిన పెదపోలమాంబ అమ్మవారి ఘటాలను చదురుగుడి నుంచి గ్రామంలో తిరువీధి జరిపారు. భక్తులు అమ్మవారి ఘటాలకు పూజలు చేశారు. మంగళవారం ప్రధాన పండగ నిర్వహించి, 3వ తేదీన పెదపోలమాంబ అనుపోత్సవం జరుపుతామని దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

కోటలో ఆధ్యాత్మిక శోభ



అప్పన్న స్వామిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకొస్తున్న మాలధారులు

ఎస్.కోట: 'ఏల వస్తాడు నారసింహుడు... హరిహరి నారాయణో ఆదినారాయణ' అంటూ భజన బృందాల గీతాలాపనలు.. మహిళల కోలాటప్రదర్శనలు.. గరిడీలు... భక్తుల సింహాద్రి అప్పన్న నామస్మరణతో ఎస్.కోట పట్టణం మారుమోగింది. అప్పన్న మాలధారులందరూ ఏటా మాదిరిగానే సింహాచలం సోమవారం చందన పెరుమాళ్ పీఠం నుంచి అప్పన్న స్వామిని పల్లకిలో తీసుకొచ్చారు. స్థానిక షిర్డీసాయి కోవెల నుంచి తిరువీధి ప్రారంభమైంది. పరిసర గ్రామాల ప్రజలు చేరుకుని దారిపొడవునా అప్పన్నస్వామిగా భావించే తోపుటెద్దు కాళ్లుకడిగి, పసుపుకుంకుమలతో పూజలు చేశారు. హారతులిచ్చారు. అప్పన్నస్వామి నామస్మరణతో ఎస్.కోట పట్టణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

ముగిసిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలు

చీమకుర్తి: పేర్నమిట్టలో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి 42వ షూటింగ్ బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. బాలికల విభాగంలో గుంటూరు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. బాలుర విభాగంలో బాపట్ల, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయన్నారు. విజేతలకు స్థానిక కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు చేతుల మీదుగా మెమెంటోలు అందించి అభినందించారు.

డ్వాక్రా సంఘాల.. కొత్త వ్యాపారం



నిత్యావసర సరుకులను ప్యాకింగ్ చేస్తున్న మహిళా మార్ట్ నిర్వాహకులు

- వీరఘట్టంలో మహిళా మార్ట్
- 15వేల మంది డ్వాకా మహిళల ఆర్థిక భాగస్వామ్యం
- ప్రతిమహిళా రూ.200 చొప్పున రూ.30 లక్షల పెట్టుబడి
- ప్రతినెలా రూ.3 కోట్ల వ్యాపారమే లక్ష్యంగా అడుగులు
- సంక్రాంతికి ముందే ప్రారంభం



వీరఘట్టంలో ప్రారంభానికి సిద్ధమైన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్

వీరఘట్టం: మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పొదుపుసంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తోంది. వైఎస్సార్ చేయూత కింద మహిళామార్ట్‌ల ఏర్పాటుకు కావాల్సిన వనరులు సమకూర్చుతోంది. కనీస పెట్టుబడితో మహిళలను వ్యాపారంలో భాగస్వాములను చేస్తోంది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో తొలి మహిళామార్ట్ ఏర్పాటుకు వీరఘట్టం మండల కేంద్రం వేదికైంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుని మహిళామార్ట్ ప్రారంభానికి సిద్ధమైంది. జనవరి మొదటి వారంలో మహిళామార్ట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వీరఘట్టం ప్రధాన రహదారిలోని ఓ అద్దె భవనంలో సర్వాంగ సుందరంగా మహిళా మార్ట్‌ను తీర్చిదిద్దారు. మార్కెట్ ధరల కంటే తక్కువకే నాణ్యమైన సరుకులను ఇక్కడ విక్రయించనున్నారు.

అందరి భాగస్వామ్యంతో...

పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం పట్టణంలో తొలిమహిళా మార్ట్‌ను డ్వాక్రా సంఘాల సౌజన్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంలోని 1600 మహిళా సంఘాల్లో ఉన్న 15 వేల మంది సభ్యులు ఒక్కొక్కరు రూ.200 చొప్పున పెట్టుబడితో రూ.30 లక్షలు పోగుచేశారు. సరుకుల దిగుమతికి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. మరికొన్ని సరుకులను పెద్దపెద్ద హోల్‌సేల్ షాపుల్లో ఖరీదు చేశారు. ఇలా వివిధ రకాలుగా ఖరీదు చేసిన సరుకులను మహిళా మార్ట్‌లో తక్కువ ధరకే విక్రయించనున్నారు. ప్రతినెలా రూ.3 కోట్ల వ్యాపారం చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు.

మార్ట్ పర్యవేక్షణకు మహిళా కమిటీ ఏర్పాటు

వీరఘట్టంలో ఏర్పాటు చేసిన మార్ట్‌ను పర్యవేక్షించేందుకు 15 మంది మహిళలతో కూడిన ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి వీరఘట్టంకు చెందిన దాసరి పుణ్యవతిని అధ్యక్షురాలుగా నియమించారు. అలాగే, కార్యదర్శి ఒకరు, ముగ్గురు కోశాధికారులతో కూడిన 15 మంది మహిళా సభ్యులు ఉన్నారు. కమిటీ తీర్మానం ప్రకారం కావాల్సిన సరుకులను ఖరీదు చేస్తారు. ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు సేల్స్ మహిళలను నియమించారు. వీరికి ఒక్కరికీ ప్రస్తుతానికి రూ.5 వేల చొప్పున జీతం ఇస్తారు. వెలుగు కార్యాలయం నుంచి ఒకరు మార్ట్ ఇన్‌చార్జిగా ఉంటూ ఇక్కడ పరిస్థితిని పర్యవేక్షిస్తారు.



మార్ట్‌లో అందంగా రూపొందించిన కౌంటర్లు

సంక్రాంతికి జోరుగా విక్రయాలు

ప్రస్తుతం మహిళా మార్ట్‌కు 15 వేల మంది మహిళా సభ్యులు ఖాతాదారులుగా ఉన్నారు. వీరందరూ రూ.3 కోట్ల విలువైన సరుకులను సంక్రాంతి పండగ కోసం కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్‌లుగా ఇచ్చారు. బజారులో మనం నిత్యం కొనుగోలు చేసే సరుకులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్ట్‌లో కొనుగోలు చేస్తే మార్ట్‌లో వ్యాపారం పెరుగుతుంది. లాభాలు వస్తాయి... వచ్చిన లాభాలను అన్ని సంఘాలకు సమానంగా పంచుతారు. ఇలా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మార్ట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మార్ట్ జనవరి మొదటి వారంలో తమ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించనున్నారు.

వ్యాపారాభివృద్ధికి సహకరించాలి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇస్తున్న సున్నా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకుని పొదుపు సంఘాలన్నీ సంయుక్తంగా వీరఘట్టంలో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేశాం. ప్రతి సభ్యురాలు రూ.200 చొప్పున పెట్టుబడి పెట్టారు. ఇలా రూ.30 లక్షలు పోగుచేసి ఈ మార్ట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. వారం రోజుల్లో ప్రారంభం కానున్న మహిళా మార్ట్ వ్యాపారాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి.

– దాసరి పుణ్యవతి, అధ్యక్షురాలు, వైఎస్సార్ చేయూత మహిళామార్ట్, వీరఘట్టం

అరుదైన మార్ట్ ఇది



కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసిన అరుదైన మహిళా మార్ట్ ఇది. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఈ మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు పెద్దపీట వేస్తోంది. అందుకే జిల్లాలోని వీరఘట్టం మండలానికి తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇక్కడ నిత్యావసర సరుకులన్నీ దొరుకుతాయి. ప్రజలకు నాణ్యమైన వస్తువులను విక్రయించడమే లక్ష్యం.

– జి.శివున్నాయుడు, ఏపీఎం, వీరఘట్టం

ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయం. దీనికి అనుగుణంగా వ్యాపార రంగంలో ప్రోత్సహిస్తున్నాం. వీరఘట్టంలో వైఎస్సార్ చేయూత మహిళామార్ట్ ఏర్పాటు చేశాం. వీరఘట్టం పట్టణం వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతోంది. ఇటు సీతంపేట, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, వంగర మండలాలు అనుసంధానంగా ఉండడంతో ఇక్కడ వ్యాపారం చక్కగా సాగుతుందని అంచనా వేశాం. కొద్ది రోజుల్లో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఈ మార్ట్‌ను ప్రారంభిస్తారు.

– పి.కిరణ్‌కుమార్, పీడీ, డీఆర్‌డీఏ, పార్వతీపురం మన్యం జిల్లా

సహకారం ఎనలేనిది



వీరఘట్టంలో మహిళా మార్ట్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. దీనికి కావాల్సిన పెట్టుబడిని మనమే సమకూర్చుకుని వ్యాపారం చేద్దామని చెప్పగానే మండలంలోని 1600 గ్రూపుల్లో ఉన్న 15 వేల మంది సభ్యులు అంగీకారాన్ని తెలిపి ఒక్కొక్కరూ రూ.200 చొప్పున పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చారు. ప్రతినెలా రూ.1000 చొప్పున సరుకులు కొనుగోలు చేసి రూ.3 కోట్ల వ్యాపారం ఇచ్చేందుకు సానుకూలత తెలిపారు. ఈ మార్ట్‌ను జిల్లాకే తలమానికంగా తీర్చిదిద్దుతాం.

– పి.సుజాత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, వీరఘట్టం

కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న జేసీ

గరుగుబిల్లి: కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు పలువురు అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలను సోమవారం తెలిపారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, డీఆర్‌ఓ జె.వెంకటరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఆర్డీఓ కె.హేమలతతోపాటు పలువురు అధికారులు, నాయకులు, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సమష్టిగా కృషి చేసి జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిద్దామన్నారు.

హరికృష్ణకు ఐజీగా ఉద్యోగోన్నతి





ఐజీగా ఉద్యోగోన్నతి పొందిన హరికృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల ఎస్పీలు విక్రాంత్‌పాటిల్, దీపిక

విజయనగరం క్రైమ్: విశాఖరేంజ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.హరికృష్ణకు ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఉద్యోగోన్నతి లభించింది. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఎస్పీ ఎం.దీపిక, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లు విశాఖరేంజ్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సందడి




డిప్యూటీసీఎం రాజన్నదొరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, డీఆర్వో వెంకటరావు, తదితరులు

సాలూరు/జియ్యమ్మవలస: నూతన ఆంగ్ల సంవత్సరాదికి ఉమ్మడి విజయనగరం వాసులు ఘనంగా స్వాగతం పలికారు. ఇళ్ల ముంగిట రంగవల్లులు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హ్యాపీ గ్రీటింగ్స్‌తో సోమవారం సందడిగా గడిపారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఉద్యోగులు, ప్రజలు క్యూ కట్టారు.

- డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు వేలాదిగా సాలూరులోని ఆయన స్వగృహానికి తరలివచ్చారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ గోవిందరావు, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డీఆర్వో వెంకటరావు, ఏఎస్పీ దిలీప్‌కిరణ్, ఐటీడీఏ ఈఎస్‌సీ శ్రీనివాస్, డ్వామా పీడీ రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు రాజన్నదొరకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాజన్నదొర తన సతీమణి రోజమ్మతో కలిసి కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు.
- చినమేరంగిలోని తమ స్వగృహంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పాల్గొన్నారు. కురుపాం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరై నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



విజయనగరంలో ఒకరికొకరు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీసీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు



డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



చినమేరంగిలో కేక్ కట్‌చేస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు , పార్టీ నాయకులు, అధికారులు

మన్యం ప్రజలకు ఆరోగ్య భాగ్యం



గరుగుబిల్లి మండలం పెద్దూరులో జేఏఎస్ శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు(ఫైల్)

- నేటి నుంచి రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష
- జిల్లాలో నెలకు 72 వైద్య శిబిరాల నిర్వహణ
- ప్రతి ఆరునెలలకోసారి ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- గిరిజన గ్రామాల్లో ఆహార సదపాయం
- మారుమూల గ్రామాల్లో స్పెషలిస్టు డాక్టర్ సేవలు
- ఇంటింటా ఆరోగ్య సర్వేలో నిమగ్నమైన వలంటీర్లు, ఏఎన్‌ఎంలు

పార్వతీపురం టౌన్: వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మమైన మార్పులు సత్ఫలితాలనిస్తున్నాయి. నాడు-నేడు నిధులతో ఆస్పత్రుల ఆధునికీకరణ, విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పల్లె, వార్డు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువయ్యాయి. ఇటీవల చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు చక్కని వైద్యాన్ని అందించాయి. ఆరోగ్యభరోసా కల్పించాయి. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించడం, ఆయుష్షును పెంచడమే లక్ష్యంగా మంగళవారం నుంచి రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

నేటి నుంచి రెండోవిడత ఆరోగ్య సురక్ష

ప్రతి ఆరునెలలకోసారి ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నెలకు 72 శిబిరాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమయ్యే మందులను కేంద్ర డ్రగ్ స్టోర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయాలకు పంపించి, అక్కడ నుంచి బాధితులకు అందించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ మంగళ, శుక్రవారాలు మండలాల్లోను, ప్రతీ బుధవారం పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఉన్న 8 మండలాల్లో మంగళవారం, ఏడు మండలాల్లో శుక్రవారం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ ప్రాంతాల్లో బుధవారం వైద్యశిబిరాల నిర్వహణకు సర్వం సిద్ధంచేశారు.

అపూర్వ స్పందన

గత ఏడాది సెప్టెంబర్ 30 నుంచి నిర్వహించిన తొలివిడత జేఏఎస్ (జగనన్న ఆరోగ్య సురక్ష) వైద్య శిబిరాలకు అపూర్వ స్పందన వచ్చింది. జిల్లాలో 292 శిబిరాలు నిర్వహించగా మొత్తం 1,29,191 మంది వైద్యసేవలు పొందారు. 9,178 మందికి బీపీ, 4,571 మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించి చికిత్స, మందులు అందజేశారు. 2,547 మందిని మెరుగైన వైద్యసేవలకు పెద్దాస్పత్రులకు రిఫర్ చేయగా 2,316 మంది చికిత్స పొందారు. కంటి వెలుగు కింద 18,773 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, 1260 మందికి కేటరాక్ట్ సమస్య గుర్తించి 392 మందికి శస్త్ర చికిత్సలు పూర్తి చేశారు. 1229 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

రెండో విడత శిబిరాల నిర్వహణ ఇలా...

మండలం	నిర్వహించనున్న శిబిరాలు
బలిజిపేట	17
భామిని	13
గరుగుబిల్లి	11
గుమ్మలక్ష్మీపురం	22
జియ్యమ్మవలస	24
కొమరాడ	18
కురుపాం	19
మక్కువ	15
పార్వతీపురం అర్బన్	15
పాచిపెంట	15
పాలకొండ అర్బన్	9
పాలకొండ	20
పార్వతీపురం	17
సాలూరు	20
సాలూరు అర్బన్	14
సీతంపేట	29
సీతానగరం	20
వీరఘట్టం	22

పేదల ఆరోగ్యమే ధ్యేయం



పేదలకు అందని ద్రాక్షగా ఉన్న వైద్యసేవలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. కొత్త ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష రెండోవిడత కార్యక్రమం చేపట్టనున్నారు. పల్లెలకు డాక్టర్లు రావడం ప్రజలు గొప్పవరంగా భావిస్తున్నారు. నెలన్నర రోజులపాటు వైద్యాధికారులతో ఇతరశాఖల అధికారులు సమన్వయంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను విజయవంతం చేశారు. రెండోవిడత కార్యక్రమాన్నీ విజయవంతం చేస్తాం.

– డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, పార్వతీపురం

ఇంటింటా ఆరోగ్య సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, వైద్యసిబ్బంది సర్వే చేసి, అనారోగ్య సమస్యలున్న వారిని జల్లెడ పట్టారు. దీంతో పలు వ్యాధులు బయటపడ్డాయి. ప్రధానంగా బీపీ, మధుమేహం, కంటి సమస్యలు, టీబీ వ్యాధులు వెలుగులోకి వచ్చాయి. వారంతా ఇప్పుడు చికిత్స తీసుకునే పనిలో పడ్డారు. సకాలంలో తగిన వైద్యం చేసేందుకు జేఏఎస్ శిబిరాలు తోడ్పడ్డాయి. రెండో విడత కూడా వైద్య శిబిరాల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లుచేశాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

భామినిలో తిష్టవేసిన ఏనుగులు



చెరకుతోట బయట తిరుగుతున్న ఏనుగుల గుంపు

భామిని: భామిని మండల కేంద్రంలో నాలుగు ఏనుగుల గుంపు సోమవారం సంచరించింది. భామినికి చెందిన లక్ష్మీపతినాయుడుకు చెందిన చెరకు తోటలో తిరుగుతూ పంటను నష్టపరిచాయి. తివ్వా కొండ నుంచి దిగివచ్చిన ఏనుగుల గుంపు ఒడిశా వైపు వెళ్లేందుకు వంశధార వరదకాలువ అడ్డంగా ఉండడంతో కొండ సమీపంలోనే ఉండిపోతాయని రైతులు భయాందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

మంత్రి బొత్సను కలిసిన ఐఐఐటీ డైరెక్టర్



మంత్రి బొత్సను కలిసిన ఆర్‌జీయూకేటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ

విజయనగరం అర్బన్: నూతన సంవత్సరం సందర్భంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణను ఆయన నివాసంలో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (ఆర్ జీయూకేటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది అందరికీ శుభాలు కలగాలని మంత్ర బొత్స సత్యనారాయణ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. సర్వతోము ఖాభివృద్ధికి నిరంతరం శక్తి వంచన లేకుండా పనిచేస్తున్న జిల్లా యంత్రాంగానికి అభినంద నలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఓఎస్డీ సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, డీన్ వెల్ఫేర్ రవి, పీఆర్ మామిడి షణ్ముఖ, ఐఐఐటీ ఉన్న తాధికారులు ఉన్నారు.

జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సుస్మితకు స్వర్ణం



సాధించిన పతకాలను చూపిస్తున్న సుస్మిత

నెల్లిమర్ల రూరల్: అరుణాచల్‌ప్రదేశ్ లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో జరుగుతున్న డిసెం బర్ 28 నుంచి ఐడ బ్ల్యూఎల్ఎఫ్ జాతీయస్థాయి యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాం పియన్ షిప్ పోటీల్లో నెల్లిమర్ల మండలంలోని కొండ వెలగాడ గ్రామానికి చెందిన క్రీడాకారిణి వల్లూరి సుస్మిత స్వర్ణ పతకం సాధించింది. 55 కేజీల యూత్ విభాగంలో పోటీలో పాల్గొన్న సుస్మిత స్నాచ్‌లో 77 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 96 కిలోలు..మొత్తం 173 కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకం దక్కించు కుంది. అలాగే జూనియర్ విభాగంలో రజత పతకం కై వసం చేసుకుంది. ప్రతిభ కన బరిచిన క్రీడాకారిణికి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మి, వెంక టరామయ్య, చల్లా రాము, తదితరులు అభి నందనలు తెలిపారు.

ఏపీఎస్ఈజీసీ సభ్యుడిగా అల్లు లావణ్యకుమార్



అల్లు లావణ్యకుమార్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గ్రామీణాభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఆంధ్రప్ర దేశ్ స్టేట్ ఎంప్లాయి మెంట్ గ్యారెంటీ కౌన్సిల్ (ఏపీఎస్ఈ జీసీ) సభ్యుడిగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన అల్లు లావణ్యకుమార్ (రాహుల్‌నాయుడు) నియ మితులయ్యారు. ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఐఆర్ పీడబ్ల్యూఏ) కోశాధికారిగా సేవలందిస్తున్న ఆయనకు ఈ ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్త ర్వులు జారీ చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యా లనాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో తనకు తోడ్పాటు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు, కురు పాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి ధన్య వాదాలు చెప్పారు.

వైద్యశిబిరాలను సద్విని యోగం చేసుకోవాలి

- జగనన్న సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి స్వప్న



మందులను పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి స్వప్న

డెంకాడ: ఈ నెల రెండో తేదీ నుంచి నిర్వ హించనున్న జగనన్న సురక్ష వైద్య శిబి రాలను రోగులు సద్వినియోగం చేసుకో వాలని జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర నోడల్ అధికారి స్వప్న కోరారు. మండల కేం ద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆమె సం దర్శించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరా లకు అవసరమైన మందుల నిల్వలను పరిశీ లించారు. కార్యక్రమం విజయవంత మయ్యేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వైద్యులు భవానీ, శివరామకృష్ణలను ఆదేశిం చారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹290	₹200

మహిళకు మరింత రక్ష!

- మహిళలకు అండగా దిశ వన్‌స్టాప్ సెంటర్
- సమస్యను బట్టి సత్వర సాయం
- వైద్యం, న్యాయం, రక్షణ, సంరక్షణ ఇలా సాయమేదైనా..
- కౌన్సిలింగ్, పోలీస్, న్యాయసేవల ద్వారా సమస్యల పరిష్కారం
- ఆరేళ్లలో అందిన ఫిర్యాదులు 3,363



దిశ వన్‌స్టాప్ కార్యాలయం



బాధితులకు కౌన్సిలింగ్ ఇస్తున్న దిశ వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: దిశ వన్‌స్టాప్ సెంటర్ మహిళ లకు మరింత రక్షణ కల్పిస్తోంది. వివిధ సమస్య లతో సతమతమవుతున్న ఆడవాళ్లంతా ఇక్కడికే వస్తారు. రక్షణ కావాలని కొందరు, సంరక్షణ కావాలని మరికొందరు విన్నవించుకుంటారు. ఇలాంటి వారందరికీ తగిన సహాయ, సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారు.. దిశ వన్‌స్టాప్ సెంటర్ కార్యాలయ సిబ్బంది. సమస్య ఏదైనా ఓపి కగా విని, వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తు న్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ బ్యారెక్స్ పక్కనే ఈ కార్యాలయం ఉంది. 2017 దీనిని ఏర్పాటు చేశారు. బాధిత మహిళలకు సత్వర న్యాయ, వైద్యం, రక్షణ, సంరక్షణ కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ఆపదలో ఉన్న వారైనా, ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారైనా కార్యాలయానికి నేరుగా వచ్చి గానీ ఫోన్ ద్వారా గానీ తమ సమస్యను చెప్పుకోవచ్చు. ఇంట్లో భర్త, అత్తమామల నుంచి వరకట్న వేధింపులు, గృహహింస, లైంగికదాడి, యాసిడ్ దాడి, హత్యాయత్నానికి గురైన వారు, ప్రేమ పేరిట మోసపోయిన వారు, పలు సమస్యల కారణంగా ఇంటి నుంచి బయటకు వచ్చిన వారు, ఇంట్లో నుంచి గెంటివేయబడిన వారంతా బాధి తులే. ఇలాంటి వారందరికీ శ్రీరామరక్షలా దిశ వన్ స్టాప్ సెంటర్ నిలుస్తోంది. దీంతో బాధితుల్లో చాలామంది మహిళలు తమ సమస్యలు తొలగి, ఆనందంగా ఉంటున్నామని సంతోషం వ్యక్తం చేస్తు న్నారు.

ఫిర్యాదుల వివరాలిలా..

ఫిర్యాదు విభాగం	ఫిర్యాదుల సంఖ్య
రిజిస్టర్ అయిన ఫిర్యాదులు	1671
భార్యాభర్తల మధ్య వివాదాలు	531
అత్యాచారాలు	150
లైంగిక వేధింపులు	53
యాసిడ్‌దాడులు	2
మానవ అక్రమరవాణా	2
పిల్లలపై లైంగిక వేధింపులు	3
బాల్యవివాహాలు	47
బాలికల కిడ్నాప్, అదృశ్యం	139
సైబర్ క్రైమ్	14
వరకట్న వేధింపులు	11
ఇతర కేసులు	719

శాశ్వత పరిష్కారం..

ఏదైనా సమస్య పరిష్కారానికి కార్యాలయాన్ని ఆశ్రయించే మహిళల ఫిర్యాదుల ఆధారంగా ఇరువర్గాలను పిలిపించి, కౌన్సిలింగ్ ఇస్తారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే పోలీస్, న్యాయసహాయం తీసుకుని, సమ స్యకు శాశ్వత పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకుంటారు. గడిచిన ఆరేళ్లలో 3,363 ఫిర్యాదులు అందాయి. వీటన్నింటినీ దిశ వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పరిష్కరించారు. వీటిలో లీగల్ ఎయిడ్, కౌన్సిలింగ్ సపోర్ట్ 244 మందికి, వైద్య సహాయం 649 మందికి, 652 మందికి పోలీస్ అసిస్టెంట్ సాయం అందిం చారు. 65 మందికి షెల్టర్ సాయం కల్పిం చారు. సైకో సోషల్ కౌన్సిలింగ్ సపోర్ట్ 1643 మందికి, 14 మందికి ప్రభుత్వ పథకాలు ఇచ్చారు. కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా 96 మం ది మహిళలు వారి భర్త, అత్తమామలతో సం తోషంగా జీవిస్తున్నారు. ఇవేకాకుండా 1152 అవగాహన సదస్సులు నిర్వహించి, మరెంతో మంది మహిళల సమస్యలు పరిష్కారమ య్యేలా చేశారు.

ధైర్యంగా సమస్య చెప్పుకోండి..



ఆపదలో ఉన్న ఆడవాళ్లం తా ధైర్యంగా సమస్యను చెప్పుకోవాలి. నేరుగా కార్యాలయానికి వచ్చి గానీ టోల్‌ఫ్రీ నంబర్ 181 లేదా 8501914624కు ఫోన్ చేసి గానీ ఫిర్యాదు చేయవచ్చు. సమస్యకు అనుగుణంగా అవసర మైన సహాయం అందిస్తాం. తమను ఆశ్రయిం చిన వారిలో చాలామంది సమస్యలు పరిష్కా రమై, వారంతా మంచిగా జీవిస్తున్నారు.

– పి.సాయివిజయలక్ష్మి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్, దిశ వన్‌స్టాప్ సెంటర్.

ఇవీ సాక్ష్యాలు..

1. బొండపల్లి మండలానికి చెందిన 23 ఏళ్ల వివాహిత భర్త, అత్తమామలు వేధించడంతో దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను ఈ ఏడాది అక్టోబర్ 19వ తేదీన ఆశ్రయించారు. దీంతో సిబ్బంది ఆమె భర్తను, కుటుంబ సభ్యులను పిలిపించి, కౌన్సి లింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ మహిళ తన భర్త, అత్తమామలతో సంతోషంగా జీవిస్తోంది.
2. బొబ్బిలి మండలానికి చెందిన 30 ఏళ్ల వివాహిత భర్త వేధించడంతో ఈ ఏడాది సెప్టెం బర్ 13వ తేదీన పురుగుమందు తాగి, ఆత్మహ త్యయత్నానికి ప్రయత్నించింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలు సుకున్న దిశ వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది ఆమెకు అవసరమైన వైద్యసాయం అందేలా చర్యలు తీసుకున్నారు. డిశ్చార్జ్ అయిన తరాత ఆమెను, ఆమె భర్తను, కుటుంబ సభ్యులను పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చి, ఒక్కటి చేశారు. ఇంకెప్పుడు ఆమెను ఇబ్బంది పెట్టమని ఆమె భర్తతో భరోసా ఇప్పించారు. ఇలా ఒకరిద్దరు కాదు ఎంతోమంది తమ సమస్యల పరిష్కారానికి దిశ వన్‌స్టాప్ సెం టర్ ద్వారా సహాయం పొందుతున్నారు.

ఏమైందో..ఏమో..?

- పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్య



మృతుడు అరవింద్(ఫైల్)



కుటుంబసభ్యులు, స్నేహితుల నుంచి వివరాలు సేకరించి ఫోన్ కాల్స్ పరిశీలిస్తున్న ఎస్సై గోవింద

వీరఘట్టం: ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న కుటుంబం.. ఇంటికి ఒక్క గానొక్క కొడుకు..హైద రాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యో గం..నెలకు రూ.1 లక్ష వరకు జీతం. ఇంటి వద్దే మూడేళ్లుగా వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ఉద్యోగం చేస్తున్నాడు.. ఇంత చక్కటి జీవితం ఆ యువకుడికి ఆనందాన్ని ఇవ్వలేదు..ఏం జరిగిందో ఏమో వం టిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు. సోమ వారం ఊరంతా నూతన సంవత్సరవేడుకలతో ఆనందోత్సవాలు జరుగుతుండగా ఆ ఇంట మాత్రం విషాదం నెలకొంది. పోలీసులు, కుటుం బసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పాలకొండ మండలం గోపాలపురం గ్రామా నికి చెందిన పాసినబిల్లి అరవింద్(24) వీరఘట్టం మండలం బొడ్లపాడు జీడితోటల్లో శరీరానికి నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఫ్రెండ్‌ను బస్సు ఎక్కించి వస్తా నని ఇంటి నుంచి బయల్దేరిన అరవింద్ ఉదయం 10 గంటల వరకు కుటుంబసభ్యులతో ఫోన్‌లో టచ్‌లో ఉన్నాడు. తర్వాత బొడ్లపాడు తోటల్లో ఉన్నట్లు ఇంటికి లొకేషన్ షేర్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. ఈ లొకేషన్‌లో ఆదివారం రాత్రి ఈ ప్రాంతంలో వెతికినప్పటికీ జాడ తెలియ రాలేదు. సోమవారం మళ్లీ ఇదే లొకేషన్‌కు పదిమం ది యువకులు వచ్చి ఇక్కడి తోటలో వెతకగా అర వింద్ స్కూటీ కనిపించింది. ఇంకా తోటలో వెతకగా సగం కాలిపోయిన శరీరం కనిపించింది. ఆ శరీరాన్ని పరిశీలించి అరవిందేనని నిర్ధారించారు. ఈ విషయాన్ని వీరఘట్టం పోలీసులకు తెలియజే యగా ఎస్సై ఎం.గోవింద సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి ఆత్మహత్యగా గుర్తిం చారు.అరవింద్ తండ్రి ఎర్రంనాయుడు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనం తరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

అప్పులు తీర్చలేక?

మృతుడు అరవింద్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న ఎస్సై ఎం.గోవింద దర్యాప్తు చేపట్టారు. ప్రొద్దు టూరు, హైదరాబాద్, పాలకొండతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న ఫ్రెండ్స్ వద్ద అరవింద్ రూ.లక్షల్లో అప్పులు చేసినట్లు గుర్తించారు. అరవింద్‌కు అంత లా అప్పులు చేయాల్సిన అవసరం ఏముందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. తల్లిదండ్రులకు చెప్పలేక, చెబితే ఏమంటారోనని తనలో తాను కుంగిపోయి చివరకు ప్రాణం తీసుకు న్నాడని ఎస్సై గోవింద అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు

- ప్రధాన కూడళ్లలో విజిబుల్ పోలీసింగ్
- వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేక్ కట్‌చేసిన ఎస్పీ ఎం.దీపిక



వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాటుచేసిన పటిష్ట భద్రత సత్ఫలితాలనిచ్చిం దని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. నూతన సంవ త్సర వేడుకలలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఆర్టీసీ కాం ప్లెక్స్, అంబేడ్కర్ జంక్షన్, కోట, మూడులాంతర్లు, గంటస్తంభం, ఇతర ప్రాంతాలను సందర్శించి, ఎస్పీ స్వయంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని ప్రధాన కూడళ్లలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిం చి, ర్యాష్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్‌కు పాల్పడకుండా చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ప్రజలకు, ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ చేపట్టి మద్యం తాగి, వాహనాలు నడిపే వారిపై 13 డ్రంకన్ డ్రైవ్ కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై 19 కేసులు, మద్యం అక్రమంగా కలిగిన ఉన్న వారిపై 11 కేసులు నమోదుచేశారు. బందోబస్తు అనం తరం ఎస్పీ ఎం.దీపిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేక్ కట్ చేసి, అధికారులు, సిబ్బందికి అందజేసి, అంద రికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ వెంట విజయనగరం డీఎస్పీ ఆర్.గోవింద రావు, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, రూరల్ సీఐ టీవీ.తిరుపతిరావు, టూటౌన్ సీఐ ఎన్ హెచ్‌వీ.విజయానంద్, పలువురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జాతీయ పోటీలకు రాష్ట్ర జట్ల పయనం

- 3 నుంచి ఢిల్లీలో బాక్సింగ్ పోటీలు



జాతీయ పోటీలకు వెళ్తున్న అండర్-19 బాక్సింగ్ జట్టు



అండర్-17 జట్టు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు సోమవారం పయనమయ్యారు. అండ ర్-17,19 వయ స్సుల విభాగాల్లో జిల్లా వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కన బరిచిన క్రీడాకారులు ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో జరగనున్న జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు రెండు విభాగాల్లో 27 మంది క్రీడాకారులు ఎంపికై నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమ ణ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.సూర్యారావు, జేపీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు రావాలని..!

- కాలం మారినా పెరుగుతున్న డైరీల వినియోగం
- న్యూ ఇయర్ వేళ మార్కెట్‌లో యువత, ఉద్యోగుల సందడి
- రూ.50 నుంచి లభ్యం



రాజాం మార్కెట్‌లో ఓషాపు వద్ద డైరీలు

రాజాం: కాలం మారినా, టెక్నాలజీ అందుబాటు లోకి వచ్చినా డైరీ మాత్రం తన ప్రాముఖ్యం కోల్పో లేదు. గత చరిత్ర తెలియాలన్నా, భవిష్యత్ కాల వినియోగం పొదుపుగా ఉండాలన్నా, వర్తమానం వృథాకాకుండా ఉండాలన్నా డైరీ వినియోగం తప్ప నిసరి. మేధావులు, పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలు, రాజకీయ ఉద్దండులు, లక్ష్యాన్ని అవలీలగా ఛేదించే వారి జీవితాల్లో డైరీకే ప్రథమస్థానం ఉంటుంది. డైరీ అంటే ఒక లక్ష్యం, జ్ఞాపకం, ఆత్మకథ. డైరీ రాయడం అలవాటు చేసుకునేవారు డైరీ రాయకుం డా, చూడకుండా ఉండలేరు. పాత జ్ఞాపకాలు తట్టి లేపే డైరీకి నేటి కాలంలో కూడా ఎంతో విలువ ఉం ది. ప్రధానంగా న్యూ ఇయర్ వేడుకల్లో ఎవరికైనా గిఫ్ట్‌గా ఇవ్వాలన్నా, ఎవరైనా గిఫ్ట్‌గా ఇచ్చినా డైరీకి ఎంతో గొప్పతనం ఉంటుంది. చివరికి చాలా మం ది సొంతంగా డైరీ కొనుగోలు చేసే అలవాటు కూడా ఉంది.

మార్కెట్‌లో కళకళ

న్యూ ఇయర్ సందర్భంగా డైరీలకు డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో పుస్తకాల దుకాణాల వద్ద డైరీలు అధికంగా విక్రయానికి సిద్ధం చేశారు. రూ. 50 నుంచి రూ.500 విలువచేసే డైరీలు మార్కెట్‌లో ఉన్నాయి. పలు సంఘాలు, సంస్థలు తమ ఉనికిని తెలిపేలా డైరీలు సిద్ధం చేశాయి. డైరీలు విక్రయించే షాపుల వద్ద ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగుల సందడి కనిపిస్తోంది. గ్రీటింగ్స్ కనుమరుగైనా డైరీ వినియోగం మాత్రం తగ్గలేదు. ఈ డైరీల్లో కూడా వివిధ డిజైన్స్‌తో రూపొందించినవి అందుబాటు లోకి వచ్చాయి. ఫ్లిప్ కార్ట్, అమెజాన్ తదితర ఆన్ లైన్ మార్కెట్‌లో వీటి విక్రయాలు ఎక్కువగా కనిపి స్తున్నాయి.

జ్ఞాపకాన్ని తెలియజేస్తుంది



డైరీ వినియోగం చాలా మంచి అలవాటు. డైరీని మెయింటైన్ చేయడంతో విలువైన కాలాన్ని వినియోగించుకోవచ్చు. సమయానికి తగ్గట్టుగా మన పనులు మనం చేసుకుంటాం. గతంలో మనం రాసి దాచుకున్న డైరీలు చదువుతుంటే పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తుంటాయి.

– పొట్నా సత్యనారాయణగుప్త, పారిశ్రామికవేత్త, రాజాం

చాలా మంచి అలవాటు



డైరీ రాయడం అనేది ప్రతి ఒక్కరికీ చాలా మంచి అలవాటు. వాటి ద్వారా విద్యార్థులకు మంచి జ్ఞాపకశక్తి లభిస్తుంది. గతం, వర్త మానంతో పాటు భవిష్యత్ కాలవినియోగం పొదుపుగా ఉంటుంది.

– గార రంగనాథం, రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు, రాజాం

కారుణ్య నియామక పత్రాల అందజేత



పి.వరలక్ష్మికి కారుణ్య నియామక పత్రం అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: కారుణ్య నియామకం కింద నలుగురికి ఉద్యోగ నియామక పత్రాలను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. జిల్లాలోని ఎస్ఎన్ వలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో వెల మల అభినవ్, కుమిలి జెడ్పీ ఉన్నత పాఠశాల లో సూర్యనారాయణ మూర్తి, నర్సిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పి.వరలక్ష్మి, నెమలాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాసాగర్‌లను జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ నియా మక పత్రాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద ఓ కారు చెట్టును ఢీకొంది. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ నుంచి విశాఖ వెళ్తున్న కారు ప్రమాదానికి గురైనప్పుడు అందులో ఐదుగురు ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో చిన్న పిల్లలకు స్వల్పగాయాలవడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. పెద్ద ప్ర మాదం జరగకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామానికి చెందిన పొగిరి తరుణ్‌కు మార్‌కు బైక్ ఢీకొనడంతో గాయాలయ్యాయని ఎస్సై వై.రవికిరణ్ సోమ వారం తెలిపారు. ఆదివారం రాత్రి న్యూ ఇయర్ వేడుకలు ముగించుకుని ఇంటికి నడుచుకుని వెళ్తున్న తరుణ్‌కుమార్‌ను బైక్ ఢీకొంది. వెంటనే స్థానికులు రాజాం కేర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఆస్పత్రి నుంచి వచ్చిన ఎంఎల్‌సీపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నామని ఎస్సై తెలిపారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గరుగుబిల్లి: మండల కేంద్రానికి చెందిన రైతు నాగేశ్వరరావు (35) సోమ వారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎస్సై అమ్మాన్ రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంత కాలంగా నాగే శ్వరరావు అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రత భరించ లేక గడ్డిమందు తాగేశాడు. గమనించిన బంధువులు హుటాహుటిన పార్వతీపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృ తిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు జిల్లా ఆస్ప త్రికి తరలించారు. మృతుని తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బొబ్బిలి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఆ వ్యక్తిని ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై జి.భాస్కర రావు విలేకరులకు తెలిపారు. మండలంలోని మెట్టవలసకు చెందిన దళాయి కృష్ణ మద్యానికి బానిస. ఈ క్రమంలో మద్యం తాగడం మానలేక మనస్తాపం చెంది సోమవారం మద్యం బాటిల్‌లో పురుగు మం దు కలిపి తాగి గ్రామంలోని కళ్లాల్లో అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేం ద్రాస్పత్రికి రిఫర్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

జిల్లాస్థాయి చెస్ విజేతలకు అభినందన



జిల్లాస్థాయి చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయన గరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో విజేతలను అసోసియేషన్ ప్రతినిధు లు అభినందించారు. అండర్ 7, 9, 11,13,15 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూ లల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరు కాగా..పోటీల్లో ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్న క్రీడాకారులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి ఆధ్వర్యం లో జరిగిన పోటీలకు ఏడీఎఎన్ ప్రసాద్, ఎం.గణేష్ నాయుడులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.